క్లుప్తంగా

విద్యుత్ డీఈగా విద్యాసాగర్ బాధ్యతల స్వీకరణ



డీఈకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

కొండమల్లేపల్లి : మండల విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ డీఈగా విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఈగా పనిచేసిన శ్రీనివాస్ సిరిసిల్ల జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి సీహెచ్ విద్యాసాగర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో గుత్తేదారుల సంఘం రాష్ట్ర నాయకుడు మాజిద్, డివిజన్ అధ్యక్షుడు టి.కనకాచారి, శ్రీనివాస్‌గౌడ్, ఎం.పర్వతాలు, గాజుల శ్రీను, పాండు, సంతోష్, గంగాధర్‌రెడ్డి తదితరులున్నారు.

సాయి ఆలయంలో లక్ష గాజుల పూజ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లి : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయినాథుడి ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం 3వ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి లక్ష గాజుల పూజ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నల్లగొండ జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరె కష్ణయ్య, తడకమళ్ల శ్రీనివాస్, కుంభం పుల్లారెడ్డి పాల్గొన్నారు.

శ్రీసంతోషిమాత ఆలయంలో పంచామృతాభిషేకం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంటలో గల శ్రీశ్రీశ్రీ సంతోషిమాత దేవాలయంలో అమ్మవారి జన్మదినం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ముందుగా లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, చండీ హోమం, లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలను మాతాజీ అన్నపూర్ణదేవి ఆధ్వర్యంలో వేద పండితులు దుర్వాకుల కుమారశర్మ అవధాని వేదమంత్రోత్సవాల నడుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పత్తిపాటి సంజాత నవాబు, చామల సైదులు, పారేపల్లి శ్రీనివాస్, కుంచకూరి చంద్రయ్య, రాయపూడి రామ్మూర్తి, ఓరుగంటి మల్లయ్య దంపతులు పాల్గొన్నారు.

పల్‌రెడ్డి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి

హాలియా : పేద పిల్లల అభ్యున్నతికి పల్‌రెడ్డి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని వివిధ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు జటావత్ చంద్రునాయక్, బూరుగు రామ్మూర్తి, మచ్చ సునీత అన్నారు. శుక్రవారం పల్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ పల్‌రెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో హాలియా, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలకు చెందిన నాల్గవ తరగతి విద్యార్థులకు గురుకుల ప్రవేశ పరీక్ష కోసం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోక్యానాథ్, నిర్మల, వెంకటేశ్వర్లు, రజిత, మధు, విద్యార్థులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో బీసీల అణిచివేతను మానుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : బీఆర్‌ఎస్ పార్టీలో బీసీల అణిచివేత ధోరణిని మానుకోవాలని, లేకుండా పార్టీ పతనం ఖాయమని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పొలగాని వెంకటేష్‌గౌడ్, శ్రీను, మురళియాదవ్, నర్సింహ, గంగాధర్, నరేష్ తదితరులున్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఎం నాయకుడు పాపానాయక్ అన్నారు. ఈ సందర్భంగా దామరచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, బాలసైదులు, ఖాజా మోహిదిన్, గోపి, సుభాని పాల్గొన్నారు.

అద్దె భవనాలలో అవస్థలు

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తెలంగాణ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యంలో భాగంగా ఏడు సంవత్సరాల క్రితం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో నూతన మండల కేంద్రాలలో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాల ఏర్పాటును మరిచింది. దీంతో ఆయా మండల కేంద్రాలలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతులతో అసౌకర్యాల నడుమ పాలన సాగిస్తున్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటైన మండలాల్లో తిరుమలగిరి మండలం ఒకటి. అంతకు ముందు అనుముల మండలంలో తిరుమలగిరి ఓ గ్రామంగా ఉండేది. ప్రస్తుతం పేరుకే మండల కేంద్రమైనా.. పూర్తిగా మౌలిక వసతుల కల్పన కొరవడింది. పూర్తిగా మండల కేంద్రంగా మారాలంటే సంవత్సరాలు పడుతుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

అద్దె భవనాల్లో అన్ని సమస్యలే..

మండల కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖ కార్యాలయాల్లో సిబ్బందికి సరిపడ గదులు, ఇతర సౌకర్యాలు లేక ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వర్తించడానికి, ముఖ్యమైన దస్త్రాలను భద్రపర్చడానికి తగినస్థలం లేక ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లకు సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించడంతో సమస్య మరింత తీవ్రమైంది. ఒకే గదిలో రిజిస్ట్రేషన్లు, ఇతర పనులు నిర్వహిస్తున్నారు. పోలీస్ శాఖకు సౌకర్యాలతో కూడిన కార్యాలయం లేకపోవడంతో వ్యవసాయశాఖ సబ్‌మార్కెట్‌లోని ధాన్యం నిలువచేసే గోదాంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతోంది. వ్యవసాయ శాఖ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగగా, కొంతకాలం నుంచి రైతు వేదికను వ్యవసాయ శాఖ కార్యాలయంగా మార్చారు. రూ.25లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించి విద్యాశాఖ కార్యాలయం ప్రారంభించకపోవడంతో ఇతర పనులకు హెచ్‌ఎంలు హాలియాకు వెళ్లాల్సి వస్తుంది. ఎంపీడీఓ కార్యాలయం కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత భవనంలో కొనసాగుతోంది. ఒకటే గది ఉండటంతో మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. వీటితో పాటు మహిళ సంఘాలకు కూడా పక్కా భవనం లేకపోవడంతో మహిళ సంఘాల మీటింగ్ కు అనుముల మండల కేంద్రానికి వెళ్లాల్సిన వస్తుంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం



అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి



ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లో అభివృద్ధిని మరిచింది. తిరుమలగిరి మండలం ఏర్పడి ఏడు సంవత్సరాలు అవుతున్నా నేటికి ఏలాంటి అభివృద్ధికి నోచుకోవడంలేదు. అభివృద్ధిని మరిచిన ప్రభుత్వం మండలాన్ని ఎందుకు ఏర్పాటు చేయాలి. నూతనంగా ఏర్పాటైన మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి.

– కొడావత్ హనుమంతు, సుంకిశాలతండా

రోగం వస్తే ఇతర ప్రాంతాలకు..

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు లేకపోలేదు. దీంతో ఏదైన రోగం వస్తే దూర ప్రాంతాలైన నాగార్జునసాగర్, హాలియా, మిర్యాలగూడ వంటి ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు.

సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చింతపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన లబ్ధిదారులకు పట్టాల పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో నిర్మించిన 25ఇళ్లను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్ శంషొద్దీన్, ఎంపీడీఓ రాజు, సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, ఎంపీటీసీలు ఎల్లంకి వరలక్ష్మి, నల్లవెల్లి సదానందం, మాజీ సర్పంచ్ నట్వ గిరిధర్, కోఆప్షన్ సభ్యులు జహంగీర్, ఎల్లంకి అశోక్, నల్ల శంకర్, గోవిందు శాంతయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పికె.మల్లేపల్లి గ్రామంలో రూ.69లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, నట్వ గిరిధర్, విద్యాసాగర్‌రావు, గోపిడి కిష్టారెడ్డి, సర్పంచ్ కొప్పుల పార్వతమ్మ, గుస్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



చింతపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



దేవరకొండ : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

దేవరకొండ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన పలువురు వివిధ పార్టీల నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రునాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, సురేష్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌కు రెండవ ఏఎన్ఎంలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండోవ ఏఎన్ఎంల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో చంద్రకళ, విద్యావతి, అరుణ, వెంకటమ్మ, కరుణ, ఇర్ఫత్, ప్రసన్న, అనిత, ధనమ్మ, విజయలక్ష్మి తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ : ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు మరింత పెరిగాయని, ప్రభుత్వం వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనం రాధిక, మణెమ్మ, సునంద, నాగమణి, పద్మావతి, శాంతి, వెంకట్రాములు తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు అందజేత

కొండమల్లేపల్లి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు సంబంధించి శుక్రవారం మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నూనె రామస్వామి, పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈనెల 11నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కోట్ల శోభ, విజయలక్ష్మి, మేరి, పద్మ, మాణిక్యమ్మ, విజయ, సుజాత, వెంకటమ్మ, రజిత, కీర్తి పాల్గొన్నారు.



దేవరకొండ : సీడీపీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న టీచర్లు, నాయకులు

ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడాలి



సభలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ డివిజన్ 40వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, విజ్ఞానాన్ని అందించే పాఠ్యాంశాలను తొలగించి మతతత్వం పెంచి పోషించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, రైతు సంఘం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదావత్ రవినాయక్, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.అంజాద్, నాయకులు కుర్ర సైదానాయక్, జగన్‌నాయక్, వదుద్, సుమన్, వీరన్న, వంశీ, శ్రవణ్, తరుణ్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మిర్యాలగూడ అర్బన్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నేటి నుంచి 7వతేదీ వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు రామకృష్ణ, భిక్షం, రవి, సీతారాములు, రామాచారి, నరేష్, నిర్మల, సైదులు తదితరులున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

హాలియా : పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. బేటీ బచావో బేటీ పడావో, పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, ఉన్నతంగా ఎదగాలన్నారు. రక్తహీనత రాకుండా రాగిజావ లాంటి పౌష్టికాహారం తీసుకుంటే బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం బాల కార్మికత అత్యాచారాలు, బాల్య వివాహాలు, నిరక్షరాస్యత, పౌష్టికాహారం ప్రాముఖ్యత, ముడిధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్‌ఓ హైమావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ గంధం పద్మావతి

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హాలియా : వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతగూడెంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు భరత్‌రెడ్డి, బాబు, నాగార్జున్‌రెడ్డి పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కూరాకుల లింగమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడేపు రామలింగయ్య, ఎంపీటీసీ అవుల ఎల్లమ్మ, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్స్ సురభి రాంబాబు, పగిడిమర్రి మరియమ్మ ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : రాష్ట్రంలోని రెండో ఏఎన్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు కాంగ్రెస్, సీపీఐ పార్టీలు నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సయ్యద్, కోట శ్రీనివాస్, దేవిరెడ్డి శేఖర్‌రెడ్డి, ధీరావత్ లింగానాయక్, వెంకన్న, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను బీఏ(ఈహెచ్‌పీ), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజెడ్‌సీ) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 4వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

తిరుమలగిరి (నాగార్జునసాగర్) : నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మొక్క పరశురాంగౌడ్ అన్నారు. సీపీఎస్ విద్రోహదినం సందర్భంగా శుక్రవారం మండలంలోని యల్లాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెక్కం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీపీఎస్ విధాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో శుక్రవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మంద సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం పాత పద్ధతిలో పెన్షన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాస్, కొర్ర లోక్యనాయక్, శ్రీనివాస్, జగదీశ్వర్, సీతారాం, చంద్రమౌళి, నీరజ, సరస్వతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీపీఎస్‌కు వ్యతిరేకంగా పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి : పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మండల కేంద్రంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మూనా, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కొండల్‌రావు, అనీల్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నూతన పెన్షన్ విధానంతో భద్రత కరువు

పెద్దవూర : నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగులకు భద్రత కరువైందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దండ వీరారెడ్డి అన్నారు. సీపీఎస్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



అడవిదేవులపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



పెద్దవూరలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పెద్దవూర : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్కూల్ ఫెడరేషన్ క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అండర్–14, అండర్ 17 విభాగాల్లో బాలురకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాస్, పీడీ శోభారాణి, పీఈటీలు నారాయణరెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శుక్రవారం ఎంపీపీ పుట్టల సునీత, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతతో పాటు శారీరక దృఢత్వం అలవడి చదువులో ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంఈఓ బాలాజీనాయక్, హెచ్‌ఎంలు అరుణకుమారి, మంగళ, వెంకట్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.



వేములపల్లి : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ మంగమ్మ తదితరులు

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

పెద్దఅడిశర్లపల్లి : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ఎంఈఓ తరి రాము అన్నారు. శుక్రవారం మండలంలోని అజ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, సర్పంచ్ నగేష్, నర్సింహ, పరమేష్, శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలు

దేవరకొండ : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 67ఏళ్లుగా పాలసీదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని స్థానిక బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎల్ఐసీ 67వ వార్షికోత్సవ వేడుకలను స్థానిక బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. 67ఏళ్ల కాలంలో ఎల్ఐసీ ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏబీఎం మునినాయక్, చెన్నకేశవులు, లీమ్యానాయక్, శంకర్, రఘురాంనాయక్, సురేష్, ఎల్లయ్య, గాజుల రాజేష్, తదితరులున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బ్రాంచ్ మేనేజర్

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు

మిర్యాలగూడ టౌన్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణంలో «మేరీ మాటీ– మేరీ దేశ్» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి మట్టిని సేకరించారు. అనంతరం పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కలశ పూజ నిర్వహించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్యప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, సీనియర్ నేత బంటు సైదులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత శేఖర్, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, చిల్లంచర్ల పాండు, కొండేటి శేఖర్, చిలుకూరి శ్యాం, బంటు గిరి, జానకిరాంరెడ్డి, తదితరులున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మట్టి సేకరణ

దేవరకొండ : పట్టణంలోని 1, 14వ బూత్‌లలో శుక్రవారం బీజేపీ నాయకులు మేరీ మిట్టీ.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులను స్మరించుకునే విధంగా దేశ రాజధానిలో స్థూప నిర్మాణానికై ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మట్టిని సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుండాల అంజయ్య, గాజుల మురళి, బెజవాడ శేఖర్, కళ్యాణ్‌నాయక్, వినోద్‌రాథోడ్, రెడ్డి శంకర్, భాస్కర్, హరి, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటరు నమోదుపై ప్రత్యేక శిబిరం

హాలియా : అనుముల మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాడుగులపల్లి : మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ జమీరుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన బొల్లంపల్లి అరవింద్‌కుమార్ విజయవాడలోని తక్షశిల ఐఏఎస్ అకాడమిలో సివిల్స్ చదువుతున్నాడు. దీంతో అరవింద్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గడ్డంపల్లి వినయ్‌రెడ్డి శుక్రవారం రూ.20వేలు అందజేశారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే ఫౌండేషన్ లక్ష్యం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామాల్లో నీటివసతి లేకుండా ఇబ్బందులు పడుతున్న ప్రజల దాహార్తిని తీర్చడమే బుసిరెడ్డి ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిశాలతండాలో బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన రెండు బోర్లను వేయించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

హాలియా : తెలంగాణ ఓపెన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాల గడువు ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు హాలియా జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గుండా కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 90107 50686ను సంప్రదించాలన్నారు.

బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని వినతి

కొండమల్లేపల్లి : మండలంలోని దేవత్‌పల్లి గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ కంట్రోలర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా ఇన్‌చార్జ్ కొత్త అఖిల్ విజయ్, అన్వేష్ ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

త్రిపురారం : ప్రతి ఓటరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని మండల ఆర్ఐ సైదులు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఓటు వేసే విధానంపై ఈవీఎం, వీవీప్యాడ్‌ల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైదులు, రాసికప్పు శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు వేతనాలు పెంచాలి

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందున ఆర్టీసీ కార్మికుల వేతనాలు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా ఉండేలా పెంచాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 'టీఎస్ ఆర్టీసీ కార్మికుల విలీనం–ఆంధ్రప్రదేశ్ అనుభావాలు' అనే పుస్తకాన్ని ఆర్టీసీ డీఎం బోల్లేద్దు పాల్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నల్లగొండ రీజినల్ సహాయ కార్యదర్శి టి.వినయ్‌కుమార్, డిపో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాములు తదితరులున్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

వేములపల్లి : రైతులు వ్యవసాయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధ్యమవుతుందని ఏఓ రుషేంద్రమణి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో వరిపంటను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వరిలో మొగిలిపువ్వు వ్యాపిస్తున్నందున కెల్డాన్‌ను పిచికారీ చేయాలని సూచించారు.